క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా మంగళవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బిలాల్ మజీద్, మాధవనగర్, సపోటాబాగ్, సంజయ్ గాంధీ నగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ధోబీఘాట్ క్రాస్ రోడ్, హైటెక్ ఫంక్షన్‌హాల్, స్కూల్ పరిసర ప్రాంతాల్లో. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంకేశ్వరబజార్ టెంపుల్, గీతాంజలి స్కూల్, శిశుమందిర్, ఖాజాబాగ్, విష్ణునగర్, పాంపుట్ట, ఆదర్శ్‌నగర్, మదర్‌సా పరిసర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుదని డీఈ తెలిపారు.

రైతుబజారుల్లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు ఇలా.. రూ. టమాట 65, వంకాయ 28, బెండ 40, పచ్చి మిర్చి 90, కాకర 45, బీర 28, క్యాబేజి 13, ఫ్రెంచి బీన్స్ 55–90, క్యారెట్ 45, దొండ 18–28, చిక్కుడు 65, గోకర 33, బీట్‌రూట్ 25, క్యాప్సికం 67, ఆలు 20, దోస 25, సార 13, పొట్ల 18, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 28. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

సన్మానం



నాగార్జునను సన్మానిస్తున్న ఉపేందర్‌రెడ్డి, గణేష్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగార్జునను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత సోమవారం కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీంద్ర, రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, పగడాల శ్రీశైలం, కల్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, సలీం, పాండు, అనుదీప్, సల్లంగి శ్రీనివాస్, హరి, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, శ్రీధర్, పింటూ, విప్లవ్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు

బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి



వాటర్‌వర్క్స్ డీజీఎంతో సమావేశమైన కార్పొరేటర్ అరుణరవీందర్‌రెడ్డి

సైదాబాద్: బోనాల ఉత్సవాలకు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఆమె వాటర్‌వర్క్స్ డీజీఎం షీలా రాణి, మేనేజర్ శ్రవణ్‌కుమార్‌తో సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో డ్రైనేజీలు లీక్ కాకుండా పూడిక తీయాలని కార్పొరేటర్ వారికి సూచించారు. బోనాల సమయం కాబట్టి రహదారులపై మురుగు పారకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సైదాబాద్‌లో అమ్మవారి బోనాల సందర్భంగా ఘనంగా నిర్వహించే ఘటాల ఊరేగింపు రోజు వాటర్‌వర్క్స్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా తాగునీరు అందించాలని ఆమె వారిని కోరారు.

బోనాలకు ఘనంగా ఏర్పాట్లు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చౌకి రవికుమార్

చాదర్‌ఘాట్: బోనాల ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేసామని ఉత్సవ కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ తెలిపారు. ఓల్డ్ మలక్‌పేట డివిజన్‌లోని పోచమ్మ ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేసామన్నారు. కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి సురేష్‌కుమార్, టిన్నుసింగ్, నవీన్ పాల్గొన్నారు.

పగిలిపోతున్న పైపులైన్లు పట్టించుకోని అధికారులు

- వృథాగా తాగునీరు
- శ్రీరమణకాలనీ, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీల్లో నీరు పారడంతో బురదమయంగా రోడ్లు



విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో పైపులు పగిలి వృథాగా పారుతున్న తాగునీరు

హస్తినాపురం డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీలో తాగునీటి పైపులు పగిలిపోయి నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజులుగా మంచినీరు రోడ్లపై పారుతుందని స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గత 20 రోజుల క్రితం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీలో తాగునీటి పైపులైన్ వాల్వ్ పగిలిపోయి 20 రోజులుగా రోడ్లపై నీరు ఏరులై పారుతూనే ఉంది. నిత్యం ఇదే మార్గంలో రాకపోకలు సాగించే అధికారులకు నీటి వృథా కన్పించకపోవడం విడ్డూరం. ఉన్నతాధికారులు స్పందించి పగిలిపోతున్నా పైపులను గుర్తించి నీటి వృథాను అరికట్టాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు. జలమండలి అధికారుల నిర్లక్ష్యంతోనే పైపులు పగిలిపోతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నూతన కనెక్షన్లు ఇచ్చేందుకు చూపే చొరవ నీటి వృథాపై పెట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నూతన కనెక్షన్ సమయంలో సంబంధిత సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. –హస్తినాపురం



నీరు పారడంలో బురదమయంగా అంతర్గత రోడ్డు

అర్చక పురోహిత్యాన్ని బ్రాహ్మణుల కుల వృత్తిగా ప్రకటించాలి



మాట్లాడుతున్న జగన్మోహన్‌వర్మ

నాగోలు: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్రహ్మగర్జన కార్యక్రమం విజయవంతం చేసిన అన్ని సంఘాల సభ్యులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది బ్రాహ్మణ బంధువులందరికీ తెలంగాణ బ్రహ్మగర్జన చైర్మన్ వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, తులసి శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. సోమవారం కొత్తపేటలో ఏర్పాటు చేసి సమావేశంలో వారు మాట్లాడుతూ.. అర్చక పురోహిత్యాన్ని బ్రాహ్మణుల కులవృత్తిగా ప్రకటించాలని, రద్దు చేయబడిన కరణీక వ్యవస్థని పునరుద్ధరించాలన్నారు. ఉభయ చట్టసభలలో కనీసం 10 మంది ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లను కేటాయించి, 2 పదవులను ఎంపీ సీట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని దేవాలయాల కమిటీలలో మెజారిటీ శాతం బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్రహ్మ గర్జన ద్వారా బ్రాహ్మణుల డిమాండ్లను అన్ని పార్టీల వారికి అందజేశామని వెల్లడించారు. ప్రసాద్, రాఘవరావు, రఘునందన్ భాస్కరమూర్తి, జయతులసి, లోక వాణిశ్రీ పాల్గొన్నారు.

‘నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చడం తగదు’



ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్: ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని 59 జీఓ కింద క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చి వేస్తున్నారని, వెంటనే అధికారులు కూల్చివేతలను ఆపాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ నాయకులు హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో ఇళ్లను నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కేవలం మెసేజ్ పెట్టి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు కట్టలేదనే కారణంగా జేసీబీలతో ఇళ్లను కూల్చి వేస్తున్నారని ఆరోపించారు. అన్యాయంగా ఇళ్లను కూల్చివేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, గాది ఎల్లప్ప, మహేష్ పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టండి

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణారెడ్డి డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో వాటర్, డ్రైనేజీ లీకేజీలు లేకుండా చేయాలని కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్టీఆర్‌నగర్, వాసవికాలనీ, యాదవనగర్ తదితర కాలనీల్లో కార్పొరేటర్ వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీల్లో తాగునీటి లైన్‌లలో లీకేజీలు కాకుండా చూడాలని వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. కాలనీలో పలుచోట్ల తాగునీరు వృథాగా పోవడాన్ని ఆమె పరిశీలించారు. కాలనీలో ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. లీకేజీ సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల నూతన పైప్‌లైన్‌లకు ప్రణాళికలు రూపొందించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు.

గంజాయి తరలిస్తున్న మహిళ అరెస్ట్



గంజాయి తరలిస్తున్న మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హయత్‌నగర్: ట్రావెల్స్ బస్సులో గంజాయిని తరలిస్తున్న ఓ మహిళను సోమవారం హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ లక్ష్మణ్‌గౌడ్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర కళ్యాణ్‌కు చెందిన అఖ్తరి ఇసాక్ మన్సూరి(51) వైజాగ్ నుంచి కళ్యాణ్‌కు గంజాయిని తీసుకెళ్లి అక్కడ విక్రయిస్తుంది. సోమవారం రామోజీ ఫిలింసిటీ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు ఓ ప్రైవేటు వాహనంలో ఆరు (ఒక్కొక్కటి 2 కిలోలు) గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. సదరు మహిళను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

మురుగులో కలిసిన ఆయిల్

జారిపడిన వాహనదారులు



మలక్‌పేట: నల్లగొండ క్రాస్‌రోడ్‌లో డ్రైనేజీ మురుగు నీరు పొంగిపొర్లుతోంది. మురుగునీటిలో ఆయిల్ కలిసి ఉండటంతో సోమవారం ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడిపోయారు. పలువురు వాహనదారులు గాయపడ్డారు. చంచల్‌గూడ నుంచి చాదర్‌ఘాట్ వైపు వెళ్లే దారిలో సోహెల్ హోటల్, ఏరియా ఆసుపత్రి మీదుగా భారత్ పెట్రోల్ పంపు వరకు రోడ్డుపై డ్రైనేజీ వరదలై పారుతోంది. జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు జారి పడిపోకుండా స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్డుపై మట్టిని పోశారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు బంద్ చేశారు. గంటకు పైగా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జలమండలి అధికారుల పని తీరుపై వాహనదారులు మండి పడుతున్నారు.

ఉప్పల్‌ను నంబర్ వన్‌గా నిలిపాం

ఉప్పల్: మహానగరంలో ఉప్పల్‌ను నంబర్ వన్ స్థానంలో నిలిపినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ఆరు రోజులుగా డివిజన్ల వారీగా నిర్వహిస్తున్న పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన వస్తోందని ఆయన తెలిపారు. చిలుకానగర్ డివిజన్‌లో మూడు రోజులు పాదయాత్ర అనంతరం సోమవారం ఆదర్శ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉప్పల్ రింగ్ రోడ్డు రూపురేఖలు మార్చిన ఘనతం బీఆర్‌ఎస్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన స్కైవాక్, థీమ్‌పార్కు, అంబేడ్కర్ నాలెడ్జి పార్కు ఇలా అనేక విధాలుగా ఉప్పల్‌ను అభివృద్ధి పర్చినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్లలో గర్వపడే విధంగా పనులు చేశామన్నారు. చిలుకానగర్ డివిజన్‌లో దాదాపుగా అన్ని పనులను పూర్తిచేసినట్లు తెలిపారు. చిన్న చిన్న సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని సాధ్యమైనంత త్వరలో వాటిని పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పల్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వేముల సంతోష్ రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, గుడి మధుసూదన్‌రెడ్డి, జల్లి మోహన్, కాసం మహిపాల్‌రెడ్డి, పిట్టల నరేష్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, స్థానికులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం

చార్మినార్: సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం సమర్పించనున్నామని కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ తెలిపారు. పాతబస్తీ గౌలిపురాలోని కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వైభవంగా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. చార్మినార్‌కు వెళ్లే ముందు కోట్ల అలీజాలోని కోట మైసమ్మ ఆలయం నుంచి భాజా భజంత్రీల నడుమ సామూహిక ఊరేగింపు కొనసాగుతుందన్నారు.

వైభవంగా సంపూర్ణ చతుర్వేద పారాయణం

చార్మినార్: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో సంపూర్ణ చతుర్వేద పారాయణం పూజా కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితులు మంత్రోచ్చరణల నడుమ ఈనెల 14వ తేదీ వరకు రోజుకో పారాయణం పూర్తవుతుందని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. సోమవారం అంకురార్పణ, రుత్వీకరణం, కలశస్థాపన, వేదారాధన కార్యక్రమాలు జరిగాయి అలంకార బ్రహ్మ శ్రుంగారం ఆత్రేయాచార్యులు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అధికారులను ఆదేశించారు. సోమవారం డివిజన్ పరిధి డాక్టర్స్ కాలనీలో.. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, జలమండలి మేనేజర్ పవిత్ర, శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆమె పర్యటించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ సమస్యను తొందరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. పైపులైన్ ఆధునీకరణకు ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకుల అంజన్, మహిళా కార్యదర్శి టి.సరిత, నాయకులు.. దయాకర్, సూర్యనారాయణ, చంద్రయ్య, శ్రీనివాస్, రామచంద్రయ్య, జలమండలి సూపర్‌వైజర్ శంకర్ పాల్గొన్నారు.

19 షాప్‌ల బహిరంగ వేలం

చార్మినార్: 2 బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలోని వెల్ఫేర్ అసోసియేషన్ పిల్లి గుడిసెలు ఆధ్వర్యంలో 19 షాప్‌లకు సోమవారం వేలం జరిగింది. డబుల్ బెడ్‌రూం నెల వారి మెయింటెనెన్స్ కోసం జీహెచ్‌ఎంసీ హౌసింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన షాప్‌లకు ఓపెన్ ఆక్షన్ జరిగింది. ఈ ఓపెన్ ఆక్షన్‌లో మలక్‌పేట్ ఎమ్మెల్యే బలాలతో పాటు కార్పొరేటర్ అబ్దుల్ సలాం షహీద్, మాజీ కార్పొరేటర్ ముర్తుజా అలీ, జీహెచ్‌ఎంసీ హౌసింగ్ విభాగం ఈఈ వెంకటదాస్‌రెడ్డి, డీఈ గంగాధర్, ఏఈ మహేష్, రఘురాం, ప్రవీణ, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సర్కిల్–6 ఏఈ మల్లికార్జున్, సైదాబాద్ తహసీల్దార్ వేణుగోపాల్, హరిబాబు పాల్గొని షాప్‌లను వేలం వేశారు. ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ.. వేలంలో షాప్‌లు పొందిన కిరాయిదారులు ప్రతినెలా తప్పనిసరిగా నెల అద్దె చెల్లిస్తూ అసోసియేషన్ నిబంధనలను పాటించాలన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు మస్తాన్, పిల్లి గణేష్, మన్సూర్, తాహెర్, యూసుఫ్ పాల్గొన్నారు.

కమ్యూనిటీహాళ్ల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్‌లో రూ.50 లక్షలతో ఐదు కమ్యూనిటీహాళ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ గ్రామంలోని కామునికంత వద్ద నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ పనులను సోమవారం ఆయన మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్యూనిటీహాళ్లను త్వరలోనే పూర్తి చేసి కాలనీ, బస్తీవాసులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నగేష్‌యాదవ్, త్రిలోక్‌గౌడ్, అఖిల్‌యాదవ్, శివశంకర్ పాల్గొన్నారు.

‘అన్యాక్రాంతం అవుతున్న పార్కు స్థలాలు’



కాలనీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నర్సింహరెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ హాయత్‌నగర్ సర్కిల్ అధికారుల ప్రోత్సాహంతోనే కాలనీలలోని పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి ఆరోపించారు. హయత్‌నగర్ పరిధి శ్రీరామ్‌నగర్‌కాలనీలోని పార్కు స్థలాన్ని సోమవారం ఆయన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నేడు పార్కు స్థలంగా ఉంది.. రేపు ఓనర్ స్థలంగా మారిపోవటానికి ప్రధాన కారణం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అని ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని చెరువులు, పార్కు స్థలాలు, ఇతర ప్రభుత్వ స్థలాలు బీఆర్‌ఎస్ నాయకులు కబ్జాలు చేస్తుంటే నోటీసులుండవు.. చర్యలుండవని, ప్రతిపక్ష నేతలు తమ సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అన్యాక్రాంతం అవుతున్న పార్కు స్థలాలను పరిరక్షించని పక్షంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సత్తిరెడ్డి, ప్రభాకర్‌గుప్తా, శ్రీనివాస్, వెంకన్న, యాదగిరియాదవ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగోలు: ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి శివ, క్రాంతి, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్ కోరారు. సోమవారం విద్యా స్థల బంద్ పోస్టర్లలను వివిధ కళాశాలల వద్ద జరిగిన కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టాలని విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపించడం లేదని విమర్శించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అనుమానాలకు తావిస్తోందన్నారు. డొనేషన్ల పేరుతో పాటు ఫీజులు అధికంగా వసూలు చేయడంతో పాటు యూనిఫాంలో పుస్తకాలు తమ వద్ద కొనుగోలు చేయాలంటూ తల్లితండ్రులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. 12న జరిగి బంద్‌ను విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్, వేణు సాయి శ్రీను పాల్గొన్నారు.

నెహ్రూ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించిన అమెరికా టీచర్లు



అమెరికా టీచర్లకు స్వాగతం పలుకుతున్న హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు

మలక్‌పేట: ఇంటర్నేషనల్ రిసెర్చ్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (ఐఆర్‌ఈఎక్స్) యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికా వారి టీచర్స్ ఎక్స్ఛేంజ్‌లో భాగంగా సోమవారం మలక్‌పేట గవర్నమెంట్ నెహ్రూ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీధర్, ఉపాధ్యాయులు వారికి స్వాగతం పలికారు. అమెరికా ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. కొలరాడో నుంచి వచ్చిన టీచర్ జెస్సికానాఫ్ సింగర్ సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మాథ్యమెటిక్స్ సబ్జెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. నార్త్ డాకోట నుంచి వచ్చిన ఆబ్రె మెక్‌నారి టీచర్ ఆంగ్లం బోధిస్తారని తెలిపారు. 10 రోజులు ఈ ప్రోగామ్ ఉంటుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిని పరిచయం చేయడానికి సౌజన్య జగదీశ్వర్ కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సుజాత, మ్యాథమెటిక్స్ టీచర్ పద్మప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దళిత, బీసీ బంధు పేరిట మోసం చేస్తున్నారు



కేంద్ర పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: దళిత, బీసీబంధు పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులు, బీసీలను మోసం చేస్తోందని బీజేపీ రంగారెడ్డి జిల్లా (అర్బన్) అధ్యక్షులు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కాలనీవాసులకు వివరించారు. దళిత బంధు పథకం బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పరిమితం అయిందని, అలాగే బీసీ బంధు పథకం కింద రూ. లక్ష ఆర్థిక సహాయం బీసీలలో కొన్ని వర్గాలకే వర్తిస్తుందని అన్నారు. అర్హులైన వారికి పింఛన్లు, డబుల్ బెడ్రూమ్ గృహలక్ష్మి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు యల్లప్ప, పార్వతి, వెంకన్న, సుజాతరెడ్డి, కుమార్, విష్ణు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

వనస్థలిపురం: పెన్షనర్ల సమస్యలపై ఈ నెల 12న ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో నిర్వహిస్తున్న మహాధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. సోమవారం వనస్థలిపురంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ 33 జిల్లాల ప్రతినిధుల సంయుక్త సమావేశం జేఏసీ చైర్మన్ కే.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టి.సుభాకర్‌రావు మాట్లాడారు. పెన్షనర్లకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలన్నారు. ప్రతి జిల్లాలో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్లు, అందుబాటులో ఉంచాలని, జూలై నుంచి పీఆర్‌సీ ప్రకటించి మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కృష్ణమూర్తి, తులసి సత్యనారాయణ, పి.జయప్రకాష్ రావు, ప్రసాద్, జ్ఞానేశ్వర్, నర్సింగ్‌రావు, అరుణ, నాగేశ్వర్‌రావు, రామారావు, జనార్దన్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, తోపుడుబండ్ల అందజేత



కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు అందజేస్తున్న దోసపాటి రాము, కార్తికేయన్

మన్సూరాబాద్: జేసీఐ హైదరాబాద్ రాయల్స్ టీమ్, రైస్ ఏటీఎం సంయుక్తాధ్వర్యంలో సోమవారం నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్ కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద కుట్టు మిషన్లు, తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా రైస్ ఏటీఎం ఫౌండర్, సామాజిక కార్యకర్త దోసపాటి రాము మాట్లాడుతూ.. జీవనోపాధికి నగరానికి వలస వచ్చి పనులు దొరక్క పస్తులుండే కుటుంబాలను ఆదుకోవటానికి రైస్ ఏటీఎం జీవనోపాధిని కల్పిస్తోందన్నారు. 14 కుట్టు మిషన్లు, 6 తోపుడు బండ్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్తీకేయన్, విధిగుప్తా, సుమతిచంద్ర, రవికిరణ్, చందన పాల్గొన్నారు.